# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- భారతదేశం-పోర్చుగీస్ సంబంధాలు చారిత్రాత్మకమైనవని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- దేశ సరిహద్దులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక వ్యవస్థను అమలు చేస్తోందని హోంమంత్రి అమిత్ షా తెలిపారు.
- వంట గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా దేశంలో ఇప్పటివరకు 52 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేయబడ్డాయని కేంద్ర అధికార వర్గాలు తెలిపాయి.
- ఢిల్లీలో రాబోయే రెండు రోజులలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం-పోర్చుగీస్ సంబంధాలు చారిత్రాత్మకమైనవని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. పోర్చుగల్, స్లోవేకియా దేశాల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు లిస్బన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా లిస్బన్‌లో పోర్చుగీస్ అధ్యక్షుడు మార్సెలో రెబెలో డి సౌసాతో చర్చలు జరిపారు. సమావేశం అనంతరం సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు వివిధ రంగాలలో విస్తృతం అయ్యాయని చెప్పారు. పోర్చుగీస్ అధ్యక్షునితో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంటూ..

(వాయిస్..34 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సరిహద్దులను కాపాడేందుకు ప్రభుత్వం ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థను అమలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. జమ్మూ-కాశ్మీర్‌లో ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకునేందుకు, భూగర్భ సరిహద్దు సొరంగాలను కూల్చివేయడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తామని చెప్పారు. కథువా జిల్లా, హిరానగర్ సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని బోర్డర్ అవుట్‌పోస్ట్ 'వినయ్'ను ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతికూల పరిస్థితుల్లో సైతం సైనికులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు. సంవత్సరం పొడవునా సరిహద్దులను కాపాడటంలో బిఎస్ఎఫ్ అంకితభావాన్ని హోంమంత్రి కొనియాడారు. అత్యంత క్లిష్ట పరిస్థితులలో విధులను నిర్వహించడం ద్వారా శత్రువు కార్యకలాపాలను నిరంతరం గమనిస్తూ ఉంటారని హోం మంత్రి అమిత్ షా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గృహావసరాలకు వినియోగించే 14 కిలోల LPG గ్యాస్ సిలిండర్ ధరపైన 50 రూపాయలు పెంచుతున్నామని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ వెల్లడించారు. పెరిగిన ధరలు ఉజ్వల పథకం, సాధారణ వినియోగదారులకు వర్తింపజేస్తున్నామని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్..36 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఈరోజు కీలక నిర్ణయం తీసుకుంది. లీటర్‌పై 2 రూపాయలు ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా పెట్రోల్ పై ఎక్సైజ్ డ్యూటీ 13 రూపాయలు, డీజిల్ పై 10 రూపాయలకు చేరింది. ఈరోజు అర్ధరాత్రి తర్వాత పెంచిన ఎక్సైజ్ డ్యూటీ అమల్లోకి రానున్నట్లు వివరించింది. ఇదిలా ఉండగా మరోవైపు పెట్రోలు, డీజిల్ రిటైల్ ధరలలో ఎలాంటి మార్పు ఉండదని, చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 60 డాలర్లుగా ఉందని కేంద్ర మంత్రి హర్ధీప్ సింగ్ పూరీ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES) 2025లో క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ట్రూత్‌టెల్ హ్యాకథాన్ ముగింపు కార్యక్రమం ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగుతోంది. ఈ హ్యాకథాన్‌లో 5,600 కంటే ఎక్కువ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో పోటీ పడేందుకు 25 జట్లు ముందుకు వచ్చాయి. మొదటి అయిదు స్థానాలలో ఉన్న జట్లకు 10 లక్షల రూపాయల నగదు బహుమతిని అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఇప్పటివరకు 32 లక్షల కోట్ల రూపాయల విలువైన, 52 కోట్ల మందికి పైగా రుణాలు మంజూరు చేయబడ్డాయని కేంద్ర అధికార వర్గాలు తెలిపాయి. కార్పొరేట్, వ్యవసాయేతర, చిన్న, సూక్ష్మ సంస్థలకు పది లక్షల రూపాయల వరకు పూచీకత్తు లేని రుణాలను అందించేందుకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రారంభించింది. ఈ పథకం కింద మూడు వర్గాల రుణాలు అందిస్తున్నారు. ఇందులో 50 వేల రూపాయల వరకు శిశు రుణాలు, ఐదు లక్షల రూపాయల వరకు కిషోర్ రుణాలు, పది లక్షల రూపాయల వరకు తరుణ్ రుణాలుగా విభజించి మంజూరు చేస్తున్నారు. దేశంలో దాదాపు 70 శాతం ముద్ర రుణాలను మహిళలే అందుకుంటూ, ఆర్థిక సాధికారత సాధించారు. అలాగే, అణగారిన వర్గాలలో స్వావలంబన భావాన్ని ఈ పథకం పెంపొందించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (TRAI) మొబైల్ నంబర్ ను తొలగించే విషయానికి సంబంధించి వినియోగదారులకు ఏ రకమైన సందేశాలు పంపించదని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో TRAI అధికారులుగా పేర్కొంటూ మోసగాళ్ళు.. టెలిఫోన్ కాల్స్ లేదా సందేశాల ద్వారా వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటువంటి మోసపూరిత చర్యలను గుర్తించి వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రిత్వ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపటి నుండి ఈ నెల 13వ తేదీ వరకు ఇంగ్లండ్ ఆస్ట్రియా దేశాలలో పర్యటిస్తారని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా ఆర్థిక మంత్రి రెండు దేశాలలో జరిగే మంత్రి స్థాయి ద్వైపాక్షిక సమావేశాలకు హాజరు కానున్నారు. ఈ నెల 13వ తేదీన భారత్ - యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల మధ్య జరిగే ఆర్థిక అంశాలకు సంబంధించిన చర్చలలో నిర్మలా సీతారామన్ పాల్గొంటారు. అలాగే, ఇరు దేశాల మేధావులు, పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాల నాయకులతో జరిగే చర్చలలో కూడా పాల్గొంటారని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు ఫిజీ దేశ ఆరోగ్య మంత్రి డాక్టర్ రతు అటోనియో రబిసితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఆరోగ్యం, వైద్య సహకారం గురించి చర్చించినట్లు మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమం ద్వారా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన ప్రతికూల సుంకాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 2,226 పాయింట్ల నష్టంతో 73,137 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 742 పాయింట్లు కోల్పోయి 22,161 కి చేరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల సమయంలో వివిప్యాట్ స్లిప్పులను 100 శాతం లెక్కింపు ఉండేలా చూడాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు తోసిపుచ్చింది. గతేడాది ఆగస్టు 12న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజులలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. దీంతో ఢిల్లీకి, ఐఎండి ఎల్లో అలర్ట్ ని ప్రకటించింది. నిన్న గుజరాత్‌లో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించింది. కాగా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. అలాగే ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాలలోని 21 నగరాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =